క్లుప్తంగా...

శుభాకాంక్షలు



సిటీ కోర్టులు: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా కొత్తగా నియమితులైన ఎస్.సాంబశివారెడ్డిని మంగళవారం పొన్నం అశోక్‌గౌడ్ రాష్ట్ర చైర్మన్ టీపీసీసీ లీగల్ సెల్ లా, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్టీఐ డిపార్ట్‌మెంట్, అదేవిధంగా టీపీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ కె.నరేందర్ మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తాం



కవితతో సమావేశమైన ప్రేమ్‌కుమార్ దూత్, ఆర్‌వి.మహేందర్‌కుమార్

అబిడ్స్: ఎమ్మెల్సీ కవితను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జీలు ప్రేమ్‌కుమార్ దూత్, ఆర్‌వి.మహేందర్‌కుమార్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు విశేష కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్‌తోనే గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్‌వైపే మొగ్గు చూపుతున్నారని వారు పేర్కొన్నారు.

వార్షికోత్సవం



డబీర్‌పురా: మాస్టర్స్ గ్రూపు ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవాన్ని సోమవారం రాత్రి రవీంద్రభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం నాణ్యమైన విద్య అనే అంశాన్ని ఆధారంగా చేసుకొని ఐక్యరాజ్య సమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో ఒకదానితో అనుసంధానంగా సాగింది. సంస్థ ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ ఇ.మాధవి శ్రీనివాస్, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

నేడు ఎంబీటీ బహిరంగ సభ



డాక్టర్ ఖాయం ఖాన్ (ఫైల్)

చార్మినార్: ఎంబీటీ మాజీ అధ్యక్షుడు, డాక్టర్ ఖాయం ఖాన్ జ్ఞాపకార్థం బుధవారం రాత్రి చంచల్‌గూడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని మజ్లిస్ బచావ్ తహ్రీక్(ఎంబీటీ) అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ అంజదుల్లాఖాన్ తెలిపారు. డాక్టర్ ఖాయంఖాన్ 9వ వర్ధంతిని పురస్కరించుకొని జల్సా–ఇ–యాద్–ఇ–డాక్టర్ ఖాయంఖాన్ పేరుతో ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత ఎంబీటీ అధ్యక్షుడు మాజీదుల్లాఖాన్ (ఫర్హతుల్లాఖాన్) ముఖ్య అతిథిగా హాజరవ్వనున్నారు.

క్రిస్మస్‌కు సర్వం సిద్ధం

- ముస్తాబైన చర్చిలు
- శాంటాక్లాజ్, క్రిస్మస్ ట్రీలతో కిటకిటలాడిన మార్కెట్లు
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



ముస్తాబైన సెయింట్ జోసెఫ్ కెథడ్రాల్ చర్చి

గోల్కొండ: మార్కెట్‌లో క్రిస్మస్ సందడి నెలకొంది. క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. ఫస్ట్ లాన్సర్, మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, సాలార్‌జంగ్ కాలనీ, టోలిచౌకీ నీరజ కాలనీ తదితర ప్రాంతాల్లోని చర్చిలను క్రిస్మస్ వేడుకల కోసం సిద్ధం చేశారు. సాలర్‌జంగ్ కాలనీలోని సెయింట్ మైకేల్స్ చర్చిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. చర్చి ప్రాంగణంలో ఏసుక్రీస్తు జనన వృత్తాంతం తెలిపే క్రిబ్‌ను ఆకట్టుకునేలా సిద్ధం చేశారు. అదే విధంగా నీరజా కాలనీ, అహ్మద్‌నగర్ కాలనీలలో సైతం చర్చిలు ముస్తాబయ్యాయి.

మార్కెట్‌లో క్రిస్మస్ కొనుగోళ్ల సందడి..

టోలిచౌకీ చౌరస్తా, నానల్‌నగర్, మాసాబ్‌ట్యాంక్, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లోని స్టేషనరీ షాపులు క్రిస్మస్ కొనుగోళ్లతో సందడిగా మారాయి. నానల్‌నగర్‌లోని సెంట్రల్ బుక్ డిపోలో క్రిస్మస్ క్యాప్స్, క్రిస్మస్ గౌన్లు, శాంతాక్లాజ్ ధరించే టోపీలు భాగా అమ్ముడవుతున్నాయి.



ముస్తాబైన సాలార్‌జంగ్ కాలనీలోని సెయింట్ మైకేల్స్ చర్చి

అబిడ్స్, కింగ్‌కోఠిలో..

గన్‌ఫౌండ్రీ: క్రిస్మస్ వేడుకలకు చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. అబిడ్స్, కింగ్‌కోఠి, గన్‌ఫౌండ్రీ, ఆదర్శ్ నగర్, చాపల్‌రోడ్‌లతో పాటు పలు కాలనీలలోని చర్చిలను అందంగా అలంకరించారు. రంగు రంగుల విద్యుద్దీపాలు, క్రిస్మస్ ట్రీ, స్టార్స్, శాంతాక్లాజ్ ఫొటోలతో ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు.

సందడిగా బేగంబజార్ మార్కెట్..

క్రిస్మస్‌ను పురస్కరించుకొని బేగంబజార్‌లో పలువురు షాపు యజమానులు క్రిస్మస్ ట్రీలతో వినియోగదారులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. షాపుల వద్ద క్రిస్మస్ ట్రీలు, శాంటాక్లాజ్, స్టార్స్‌తో నింపివేశారు.

ప్రధాన చర్చిలకు నిలయం..

అబిడ్స్, గన్‌ఫౌండ్రీ ప్రాంతాల్లో పలు ప్రధానమైన పురాతన చర్చిలు ఉండడం విశేషం. ఈ ప్రాంతంలో అనేక చర్చిలు ఉండడంతో నగరంలో ఇక్కడ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయి. సెయింట్ జోసెఫ్ కెథడ్రాల్ చర్చి, సెయింటినరి మెథడిస్ట్ చర్చి, సెయింట్ జార్జ్, సెవంత్ డే అడ్వనీస్ చర్చి వంటి ప్రధానమైన చర్చిలతో పాటు వివిధ కాలనీల్లో పలు చర్చిలు ఇక్కడే ఉన్నాయి. క్రిస్మస్ ఉత్సవాలను ప్రత్యేక ప్రార్థనలతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పాస్టర్లు తెలిపారు.



ఏసుక్రీస్తు జనన వృత్తాంతం తెలిపే క్రిబ్



నానల్‌నగర్ సెంట్రల్ బుక్ డిపోలో క్రిస్మస్ గౌన్ల అమ్మకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గౌరీ శంకర్ తదితరులు

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత ఆధునిక సమాజంలో చేతివృత్తులను ఆదరించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో శ్రీ విశ్వభారతి సంస్థ ఆధ్వర్యంలో రచయిత అవుసుల భానుప్రకాష్ రచించిన 'కళ్ళి' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి.గౌరీ శంకర్ మాట్లాడుతూ..చేతివృత్తులపై, ఆయా వృత్తికారుల శ్రమజీవన సౌందర్యం వర్ణించేలా పుస్తకాన్ని రాయడం అభినందనీయమన్నారు. అనంతరం చేతివృత్తుల శ్రమ సంస్కృతిని తెలుపుతూ నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకోగా పలువురు కవులకు విశ్వభారతి పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గీతారచయిత మౌనశ్రీ మల్లిక్, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రముఖ కవి ద్యాసం సేనాధిపతి కాంచనపల్లి, అప్పల ప్రసాద్ పాల్గొన్నారు.

గోషామహల్‌లో కేన్సర్ అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

అబిడ్స్: గోషామహల్‌లో కేన్సర్ అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా మురికివాడలు, బస్తీలలో కేన్సర్ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్త చేస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం బేగంబజార్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ..పార్లమెంట్ నుంచి అమిత్‌షాను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన చేస్తూ తరలివెళ్లారు.

సంక్షేమ పథకాల దరఖాస్తులన్నిటికీ త్వరలోనే మోక్షం

గోల్కొండ: అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే వారి దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో 15 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా సంక్షేమ పథకాల దరఖాస్తులు మూడు నెలల పాటు పెండింగ్‌లో ఉండిపోయాయని అలాగే సరైన దస్తావేజులు సమర్పించని దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. వీటన్నిటికీ త్వరలోనే మోక్షం లభిస్తుందన్నారు. అనంతరం ఆయన టోలిచౌకీ చౌరస్తా వద్ద పర్యటించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజీద్ ఖాన్, ఆరూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

ఉత్సాహంగా మిత్రా వింటర్ ఫెస్ట్

సాక్షి సిటీబ్యూరో: మెహదీపట్నంలోని క్రెమోన్ మాంటిస్సోరి లైఫ్ స్కూల్ 2024 శీతాకాలపు అయనాంతం గుర్తుగా మిత్రా వింటర్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్ సృజనాత్మకత, జట్టు కృషి, సహకార స్ఫూర్తి దిశగా సాగింది. ఈవెంట్‌లోని ప్రతి అంశంలో ఒకరికొకరు సహకరించుకుంటూ తమ నైపుణ్యాలను జ్ఞానాన్ని పంచుకున్నారు.



ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం



నూతన కమిటీని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సభ్యులు

లంగర్‌హౌస్: ఆర్యవైశ్య సంఘం లంగర్‌హౌస్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లంగర్‌హౌస్ డివిజన్‌కు సంబంధించి నూతన కమిటీని గౌరిశెట్టి బాబురావు, ముసత్యాల శ్రీనివాస్, కె.వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విప్పు మధూర్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి శెట్టి కృష్ణమూర్తి, కోశాధికారిగా వేముల రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు పీఆర్‌ఓలుగా దశరథం, ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు దేసు వెంకటేశ్వర్లు, మలిపెద్ది రాములయ్య, కొకుంట్ల వినయ్‌కుమార్ ఉన్నారు.

చర్చిల నిర్వాహకులకు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ప్రభుత్వం అందజేసే ప్రత్యేక నిధులకు సంబంధించిన రూ.5 లక్షల చెక్కులను మంగళవారం యాకుత్‌పురాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ చర్చిల నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రిస్మస్ వేడుకల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను తమ పరిధిలోని 5 చర్చిలకు చెందిన నిర్వాహకులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్, జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజా, యూసీడీ డీపీఓ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

గౌలిపురా: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవీ నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో పాతబస్తీ నాయకులతో కలిసి వెంకటేశ్ ప్లకార్డులను పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. ముజీబుల్లా షరీఫ్, బోయ నగేశ్, బి.వెంకటేశ్ ముదిరాజ్, తిరుపతి చంద్రశేఖర్, ఎన్.ప్రమోద్ రెడ్డి, బుల్లెట్ లడ్డూ, దినేశ్ బీడ్ల పాల్గొన్నారు.



నిరసనలో వెంకటేశ్ తదితరులు

అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన భేష్



ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీని సన్మానిస్తున్న సిరాజుద్దీన్

చార్మినార్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఉర్దూఘర్‌లో కొనసాగుతున్న అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువుల ప్రదర్శన–2024 భేష్ అని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ అన్నారు. ఈ నెల 23న ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్‌ను ఆయన మంగళవారం సందర్శించి ప్రసంగించారు. ఈ నెల 25 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో ఎన్నో శతాబ్దాల క్రితం వినియోగించిన వివిధ దేశాల కరెన్సీ, కాయిన్స్, ఇతర పురాతన వస్తువులున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ సమద్ ఉస్మానీ, సొసైటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

డీసీకి వినతి



డీసీ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులకు సమాచారం ఇవ్వడం లేదని యాకుత్‌పురా అసెంబ్లీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నాయకులతో కలిసి సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్ శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్‌లో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సిటీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి సమాచారం అందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శశి యాదవ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి పవన్ కల్యాణ్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సత్కరిస్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ: డైమండ్ జూబ్లీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఇంజినీర్లు, డాక్టర్లు, పలు రంగాల్లో ఉన్న ప్రముఖులు ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఆగాఖాన్ ఎడ్యుకేషన్ సర్వీస్ ఇండియా చైర్మన్ సిరాజ్, డైరెక్టర్ నూర్‌దీన్ దవాని, మోనీషా తేజాని, రిషాద్ జవాని పాల్గొని సంబరాలు తిలకించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత గాడే మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో ప్రతి ఒక్కరూ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని కాలాపత్తర్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఫలక్‌నుమాలోని తన కార్యాలయంలో ఏసీపీ జావెద్ తెలిపిన వివరాల ప్రకారం..రామ్నాస్‌పురాకు చెందిన మహ్మద్ యాకుబ్ ఖురేషీ ఇంట్లో ఈ నెల 14న కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో అల్మారాలో దాచిన 19 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లడాన్ని మరుసటి రోజు కుటుంబ సభ్యులు గమనించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు జకియా సుల్తానా(46), మహ్మద్ అబ్దుల్ సలీం (47)లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

దుప్పట్ల పంపిణీ



మెహిదీపట్నంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆసిఫ్‌హుస్సేన్ సోహెల్

గోల్కొండ: అనాథలు, నిరుపేదలకు 14 ఏళ్ల నుంచి చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు ఆసిఫ్‌హుస్సేన్ సోహెల్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ, షేక్‌పేట్, మెహిదీపట్నం, నానల్‌నగర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు, బస్ షెల్టర్ల వద్ద ఉండే నిరుపేదలు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసిఫ్‌హుస్సేన్ సోహెల్ వింటర్ డ్రైవ్ పేరుతో నిరంతరంగా ప్రతి చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు.



క్రైస్ట్ నిస్సీ చర్చిలో..



మెహిదీపట్నంలోని శ్రీచైతన్య స్కూల్‌లో..



గుడిమల్కాపూర్‌లోని నారాయణ స్కూల్‌లో..

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జియాగూడ: ఏసుక్రీస్తు సందేశం మానవాళికి ఎంతో ఉపయోగకరమని కేశవస్వామి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్పల్లి నర్సింహ అన్నారు. కేశవస్వామినగర్‌లోని క్రైస్ట్ నిస్సీ చర్చిలో పాస్టర్ రేవ్ ఎస్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్వాన్ పాస్టర్స్ ప్రెసిడెంట్ రేవ్ డాక్టర్ సీహెచ్. లోకేష్ శరత్, సోలోమోన్‌రాజ్ శుభాకాంక్షలు తెలుపగా దైవ సేవకులు జి.ఎస్.బ్రహమ్ చివరగా క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు.

శ్రీచైతన్య స్కూల్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: మెహిదీపట్నంలోని శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ప్రైమరీ విద్యార్థులకు ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో..

గుడిమల్కాపూర్‌లోని నారాయణ స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు కలర్‌ఫుల్ డ్రెస్సుల్లో మెరిశారు. శాంతాక్లాస్ వేషధారణలో తోటి విద్యార్థులకు గిఫ్టులు ఇస్తూ సందడి చేశారు. ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఫర్హానా మొబిన్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో..

సిటీ కోర్టులు: క్రిస్మస్ వేడుకలను నాంపల్లి కోర్టు, టీపీసీసీ న్యాయవాదుల ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు.. పొన్నం అశోక్‌గౌడ్ టీపీసీసీ లీగల్ సెల్ లా, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ కేక్ కట్‌చేశారు. టీపీసీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తిరుపతివర్మ, రాష్ట్ర కన్వీనర్ కె.నరేందర్, టీపీసీసీ హైదరాబాద్ లీగల్‌సెల్ చైర్మన్ కిషన్‌రాజ్ చౌహన్, టీపీసీసీ సభ్యులు పద్మావతి, రాజ్‌కుమార్, రాజేందర్, అరుణ్‌కుమార్, శారదకటకం, చంద్రశీల, శ్రవంతి, నర్సింహ పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న పొన్నం అశోక్‌గౌడ్, సభ్యులు